రక్షణను అందించింది. మనం పరదైసులో ప్రవేశించాలంటే దేవుడు కోరేది కేవలం యేసు ప్రభువులో విశ్వాసముంచటం మాత్రమే. విశ్వాసానికి మరేదైనా కలపాలని మనం ప్రయత్నిస్తే, దాని శక్తిని దొంగిలిస్తున్నాం, దాన్ని నాశనం చేస్తున్నాం, దాని స్థానంలో ఇంకేదో నిలుపుతున్నామన్నమాట.

కేవలం విశ్వాసం ద్వారానే మనం రక్షించబడతామనే మాటను కొత్త నిబంధనలోని యేసు ప్రభుని బోధలు ఖరారు చేస్తున్నాయి. ఉదాహరణకు, *"మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, నా మాట విని నన్ను పంపినవాణ్ణి నమ్మేవాడు శాశ్వత జీవం గలవాడు. అతడు తీర్పులోకి రాడు. మరణంలోనుంచి జీవంలోకి దాటాడు."* యోహాను 5:24.

*"దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించి తన ఒకే ఒక కుమారుణ్ణి ఇచ్చాడు. ఆ కుమారుని మీద నమ్మకం ఉంచేవారెవరైనా సరే నాశనం కాకుండా శాశ్వత జీవం పొందాలని ఇందులో దేవుని ఉద్దేశం. . . . కుమారుని మీద నమ్మకం ఉంచినవాడు శాశ్వత జీవం గలవాడు. కానీ కుమారునికి విధేయులు కాని వ్యక్తికి జీవం చూపుకు కూడా అందదు. దేవుని కోపం ఆ వ్యక్తి మీద ఎప్పుడూ ఉంటుంది."* యోహాను 3:16,36; యోహాను 7:38 కూడా చూడండి.

దొంగ నేరుగా పరదైసుకు వెళ్లిన సంగతి మనం గమనించాలి. మధ్యలో పాపప్రాయశ్చిత స్థలాలవంటివేవీ లేవు. మరెలా, ఈ దోపిడీ దొంగ నేరచరితం, ఇతర పాపాలన్నీ తక్షణమే క్షమించబడి, కడుగబడి, మర్చిపోబడ్డాయి? ప్రభువైన యేసుక్రీస్తు అతని (మరియు మన) పాపాల్ని తన మీద మోపుకున్నాడు. వాటికి తగిన మూల్యాన్ని అనుభవించాడు. *"మనం పాపాల విషయంలో చనిపోయి నీతిన్యాయాలకోసం బ్రతకాలని ఆయన తానే తన శరీరంలో మన పాపాలు మ్రానుమీద భరించాడు. ఆయన పొందిన దెబ్బల మూలంగా మీకు ఆరోగ్యం కలిగింది." "మనలను దేవుని దగ్గరకు తేవడానికి న్యాయవంతుడైన క్రీస్తు న్యాయం తప్పినవారికోసం పాపాల విషయంలో ఎప్పటికీ ఒకే సారి బాధలు అనుభవించాడు. శారీరకంగా ఆయన చంపబడ్డాడు. దేవుని ఆత్మచేత సజీవమయ్యాడు."* అని పేతురు రాశాడు – 1 పేతురు 2:24; 3:18.

పశ్చాత్తాపంతో మనం యేసుని వైపు తిరిగి, ఆయన రక్షిస్తాడని నమ్మినట్లయితే, ఆయన మనల్ని సంపూర్తిగా, శాశ్వతంగా క్షమించి పరదైసుకు సిద్ధం చేస్తాడు. అప్పుడిక మనం నిజమైన క్రైస్తవ జీవితాన్ని



ప్రారంభించవచ్చు.

సిలువ మీద దొంగ నుండి మన నేర్చుకోగలిగింది ఇదే – పరదైసు, పాప క్షమాపణ, శాశ్వత జీవం, పరలోకం – ఇవన్నీ దేవుని ఉచిత వరాలు. పశ్చాత్తాపం, యేసు ప్రభునిలో విశ్వాసం ద్వారా మాత్రమే వాటిని పొందగలం.

బైబిలు యొక్క స్పష్టమైన బోధ ఇదే. ఈ విషయాన్ని అపోస్తలుడు పౌలు కన్నా బాగా ఇంకెవరు చెప్పగలరు? ఎఫెసీ 2:8,9 వచనాల్లోని అతని దైవ ప్రేరిత మాటల్ని చదవండి:

*"మీకు పాపవిముక్తి, రక్షణ కలిగినది కృపచేతే, విశ్వాసం ద్వారానే. అది మీవల్ల కలిగినది కాదు. దేవుడు ఉచితంగా ఇచ్చినదే. ఎవరూ డంబంగా మాట్లాడుకోకుండా ఉండేందుకు అది క్రియలవల్ల కలిగినది కాదు."*

*"కాలం పూర్తి అయింది. దేవుని రాజ్యం దగ్గరగా వచ్చింది. పశ్చాత్తాపపడి శుభవార్త నమ్మండి."* అన్న యేసు మాట మన కోసమే – మార్కు 1:15.

●


---

మరిన్ని వివరాలకు–

GRACE MINISTRIES



# పరదైసుకు వెళ్లిన దొంగ



పరదైసు! పరిపూర్ణ శాంతి, పరిపూర్ణ ఆరోగ్యం, పరిపూర్ణ సంతోషం, పరిపూర్ణప్రేమ! దు:ఖం, నొప్పి, క్షీణత, మరణం ఇక ఎన్నటికీ ఉండవు. అక్కడికి వెళ్లాలని ఎవరికి మాత్రం ఉండదు. దొంగలు సైతం కోరుకుంటారు. కానీ వారికది సాధ్యమేనా?

ఆ ఆనందమయ ప్రదేశానికి వెళ్లిన ఒకవ్యక్తి ఇక్కడ ఉన్నాడు. అతను ప్రభువైన యేసు క్రీస్తుతో పాటు సిలువ వేయబడిన ఇద్దరు దొంగలలో ఒకడు. మత్తయి రాసిన సువార్తలో ఇలా గ్రంథస్తం చేయబడింది. *"ఆయనతో కూడా ఇద్దరు దోపిడీ దొంగలను, ఒకణ్ణి ఆయన కుడివైపున, మరొకణ్ణి ఎడమవైపున సిలువ వేయడం జరిగింది. ఆ దారిన వెళ్ళేవారు తలలూపుతూ, ఆయనను దూషిస్తూ ఇలా అన్నారు: "దేవాలయాన్ని నాశనం చేసి మూడు రోజుల్లో మళ్ళీ కట్టేవాడా! నిన్ను నీవే రక్షించుకో! నీవు దేవుడి కుమారుడివైతే సిలువనుంచి దిగిరా!" అలాగే ప్రధాన యాజులూ ధర్మశాస్త్ర పండితులూ పెద్దలూ ఆయనను వెక్కిరిస్తూ ఇలా అన్నారు: "ఇతడు ఇతరుల్ని రక్షించాడు, తనను రక్షించుకోలేడు! ఇతడు ఇస్రాయేల్ రాజయితే అతణ్ణి సిలువ దిగిరానియ్యి. అప్పుడు అతణ్ణి నమ్ముతాం. ఇతడు దేవునిమీద నమ్మకం ఉంచాడు గదా! 'నేను దేవుని కుమారుణ్ణి' అన్నాడుగా. ఇతడంటే దేవునికి ఇష్టం ఉంటే ఇప్పుడు ఆయన ఇతణ్ణి తప్పిస్తాడు గాక!" ఆయనతో సిలువ వేయబడ్డ దోపిడీదొంగలు కూడా అలాగే ఆయనను నిందించారు."* (మత్తయి 27:38-44).

లూకా రాసిన సువార్తలో ఆ వృత్తాంతం ఇలా విపులీకరించబడింది. *"వ్రేలాడుతున్న నేరస్థులలో ఒకడు ఆయనను దూషిస్తూ "నువ్వు అభిషిక్తుడివైతే నిన్ను నీవే రక్షించుకో! మమ్మల్ని కూడా రక్షించు!" అన్నాడు. అయితే రెండో నేరస్థుడు అతణ్ణి చీవాట్లు పెట్టి ఇలా అన్నాడు: "నువ్వూ ఇదే శిక్షావిధికింద ఉన్నావుగా. దేవుడంటే నీకేం భయం లేదా? మనకు ఈ శిక్ష న్యాయమే. మనం చేసినవాటికి తగిన ప్రతిఫలం పొందుతూ ఉన్నాం. కానీ ఈయన ఏ తప్పిదమూ చేయలేదు." అప్పుడతడు యేసుతో "ప్రభూ, మీ రాజ్యంలో ప్రవేశించేటప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకోండి" అన్నాడు. అతనితో యేసు "నీతో ఖచ్చితంగా చెపుతున్నాను, ఈ రోజే నీవు నాతో కూడా పరమానంద నివాసంలో ఉంటావు" అన్నాడు. మధ్యాహ్నం సుమారు పన్నెండు గంటలు కావచ్చినప్పుడు మూడు గంటలవరకు దేశమంతటా చీకటి కమ్మింది."* (లూకా 23:39-44)

ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం. ఒక దొంగ మరణం నుండి నేరుగా పరదైసుకు వెళ్లటం. దోపిడీలు చేపిన ఈ వ్యక్తి, మరణశిక్ష విధించబడిన ఈ నేరస్థుడు అక్కడికి ఎలా వెళ్లగలిగాడు అనేదే మనకు కలిగే ప్రశ్న. మరోలా చెప్పాలంటే అతనికి రక్షణ ఎలా లభించింది? అతనికి శాశ్వత జీవం ఎలా దొరికింది? అతని పాపాలకు క్షమాపణ ఎలా దొరికింది? ఎందుకంటే ఇవన్నీ సాధ్యమైతేనే గానీ అతను పరదైసు వెళ్లలేడు. ఇవి చాలా ప్రాముఖ్యమైన ప్రశ్నలు. మనం కూడా అవన్నీ పొందాలంటే, అతను చేసినట్టుగానే మనమూ చేయాలి.

మొదటిగా, అతను పరదైసుకు వెళ్లడంలో ఏమాత్రం పాత్రలేని కొన్ని విషయాలు పరిశీలిద్దాం. ఇది ఏదేని సంఘంలో సభ్యత్వం ద్వారానో, బాప్తిస్మం లేక ప్రభు రాత్రిభోజనం (సంస్కారం) లేక పూజ మొదలైన ఆచార సాంప్రదాయాల ద్వారానో సంభవించింది కాదని స్పష్టమవుతోంది. ఇతని విషయంలో ప్రజల్ని రక్షించే ఒక ప్రాథమిక సంగతిని గుర్తించాలి. సంఘాలు, వాటి ఆచారాలు, సాంప్రదాయాలకు దీనితో ఎటువంటి సంబంధమూ లేదు. ఒకవేళ అతను బ్రతికి వుంటే ఇవన్నీ అతను అనుసరించే వాడేమోనని నీవనవచ్చు. కానీ, ఇక్కడ విషయమేమంటే, అతను పరదైసు ఎలా వెళ్లాడు అనే కానీ, క్రైస్తవుడయ్యాక ఏమి చేసుండేవాడు అనికాదు.

అతనికి పరదైసు ద్వారాలు తెరువబడడానికి కారణం అతని ప్రయత్నాలు, క్రియలు కానే కావు. అతని క్రియలన్నీ చెడ్డవే. అతను దొంగ, దోపిడీగా, నేరస్థుడు, సిలువ మరణానికి అర్హుడు (తనే స్వయంగా ఒప్పుకున్నాడు) కాబట్టి అతని పాపాలకు రక్షణ మొదటి నుండి చివరి దాకా కేవలం దేవుని ఉచిత వరమే.

మన అవగాహన కోసం ఈ వృత్తాంతం బైబిల్లో ఉంచబడింది. దీని ద్వారా మనం పరలోకం వెళ్లాలంటే దేవుడు మన నుండి ఆశిస్తున్న ప్రాథమిక విషయాల్ని తెలుసుకోవాలి. ఈ దొంగ విషయంలో స్పష్టమైన సత్యం ఏమంటే మన క్రియల ద్వారా రక్షణ సంపాదించలేం. ఒక వ్యక్తి రక్షించబడ్డాక, పాప క్షమాపణ, కొత్త జన్మ పొందాక – మరోలా చెప్పాలంటే ఒక వ్యక్తి నిజమైన క్రైస్తవుడయ్యాక అతను లేక ఆమె మంచి క్రియలు చేయాలి. తద్వారా దేవున్ని మహిమపర్చాలి. అయితే అది రక్షణకు ఫలితాలు. అంతేకానీ మంచి క్రియల ద్వారా రక్షణ పొందలేం.

అతను ఎక్కువ ప్రార్థన చేయటం ద్వారానో లేక ఇతరులు అతని కోసం ప్రార్థన చేయటం ద్వారానో అతను రక్షించబడలేదని కూడా స్పష్టమవుతోంది. అతను నేరుగా యేసుకే చేసిన ఒక మామూలు ప్రార్థన అతని విశ్వాసాన్ని వెల్లడిచేస్తుంది. అంతే అదిచాలు. అదే అతనిలో తీవ్రమైన మార్పును తెచ్చింది.

అయితే ఇప్పుడు మనమేం చేయాలి? ఆ దొంగ చేసినట్టుగానే అక్షరాలా మనమూ చేయాలి. అతడేం చేశాడు?

మొదటిగా, అతను నేరుగా ప్రభువైన యేసుక్రీస్తుతోనే వ్యవహరించాడు. అంతక్రితం ఆయన్ని దూషించాడు, నిందించాడు, తిరస్కరించాడు. తర్వాత పూర్తిగా తన వైఖరి మార్చుకుని ఆయన వైపు తరిగి, నేరుగా ఆయన్నే ప్రార్థించాడు. ఎటువంటి మధ్యవర్తీ లేదు. కేవలం యేసుతప్ప మరే అపోస్తులునికి గానీ, మరే పరిశుద్ధులకు గానీ (బ్రతికున్నా, చనిపోయినా) యేసు తల్లికి గానీ, మరెవరికీ గానీ రక్షణతో ఎటువంటి సంబంధమూ లేదు. మనకి కావల్సిందల్లా యేసే. పరలోకంలో గానీ, భూమి మీద గానీ ఆయనంత ప్రేమ గలవాడు, కరుణాశీలి, దయామయుడు ఇంకెవరూ లేరు. ఆయన సర్వశక్తిమంతుడైన దైవ కుమారుడు. పరలోక, భూలోకాలపై సర్వాధికారం ఆయనదే. ఆయనే ఈ దొంగకు రక్షణ అనుగ్రహించాడు. ఆ రక్షణ తక్షణం, పరిపూర్ణం, శాశ్వతం. దేవుని దగ్గరకు, పరదైసుకు చేరుకునే ఏకైక మార్గం యేసే. ఆయనే తేటగా చెప్పినట్టు, *"నేనే మార్గాన్ని, సత్యాన్ని, జీవాన్ని. నా ద్వారానే తప్ప ఎవరూ తండ్రి దగ్గరకు రారు."* (యోహాను 14:6).

అపొస్తలుడైన పేతురు ప్రబోధం దీన్ని పూర్తిగా సమర్థిస్తోంది. *"పాపవిముక్తి ఇంకెవరివల్లా కలగదు. ఈ పేరుననే మనం పాపవిముక్తి పొందాలి. ఆకాశంక్రింద మనుషులకు ఇచ్చిన మరి ఏ పేరున మనకు పాపవిముక్తి కలగదు."* – అపొ. కా. 4:12

అపొస్తలుడైన పౌలు కూడా, *"ఉన్నది ఒకే దేవుడు, దేవునికీ మనుషులకూ మధ్యవర్తి ఒక్కడే. ఆయన మానవుడైన క్రీస్తు యేసు."* అని రాశాడు (1 తిమోతి 2:5)

రెండవదిగా, దొంగ తన పాపాలు ఒప్పుకున్నాడు. వాటిని విడిచి ప్రభువు వైపు తిరిగాడు. అతని పశ్చాత్తాపపు మాటలు పైన చదివాం.

*"పశ్చాత్తాపపడకపొయ్యారా, మీరూ ఇలాగే నాశనమైపోతారు. . . .పశ్చాత్తాపపడకపొయ్యారా, మీరూ ఇలాగే నాశనమైపోతారు."* అని యేసు హెచ్చరించారు (లూకా 13:3,5) దొంగ తన తప్పుల్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయలేదు. ఏవో కుంటి సాకులు చెప్పలేదు. వాటివల్ల తనకు కలిగిన న్యాయబద్ధమైన శిక్షను అంగీకరించాడు. వాటిని విడిచి యేసు వైపు తిరిగాడు. మనమూ అతని వెనకాలే పరదైసుకు వెళదామా ? అలాగైతే అతను చేసినట్టుగానే మనమూ చేయాలి.

చివరిగా, యేసు ప్రభువనీ, క్రీస్తనీ, తన రాజ్యంతో రాబోతున్న రాజనీ అతను నమ్మాడు. లూకా 23:42. అతని విశ్వాసమే అతనికి